సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 10 । నవంబర్ । 2024



ఏమార్చితే తొక్కించేస్తాం..
మోడిఫైడ్ సైలెన్సర్లను ఉపయోగించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీపీ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. 8లో



30 వేల పాములు పట్టుకున్నా
తాను ఇప్పటివరకు విశాఖ నగరం, ఒడిశాలో 30 వేల వరకు పాములు పట్టుకున్నట్లు స్నేక్ క్యాచర్ కిరణ్ తెలిపారు. 8లో



జవాన్ కన్నుమూత
అయ్యన్నపాలెం శివారు కిల్లివానిపాలెం గ్రామానికి చెందిన పారా మిలట్రీ జవాన్ గుండెపోటుతో మరణించారు. 8లో

న్యూస్‌రీల్

మార్చిలోపు ప్రసాద్ పనుల పూర్తి

కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశం



ప్రసాద్ పథకం అభివృద్ధి ప్రణాళికను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రసాద్ పథకం పనులను వచ్చే మార్చి లోపు పూర్తి చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సింహగిరిపై, కొండదిగువ జరుగుతున్న ప్రసాద్ పథకం పనులను శనివారం పరిశీలించారు. పాత గురుకుల పాఠశాల సమీపంలో కొత్త టోల్‌గేట్ వద్ద నిర్మిస్తున్న బస్టాండ్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అడవివరంలోని ప్రధాన జంక్షన్‌లో కొత్తగా నిర్మిస్తున్న పుష్కరిణి సత్రం పనులను ఫిబ్రవరిలోపు పూర్తి చేయాలన్నారు. కొండపైన బస్టాండ్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ కేంద్రం, దుకాణ సముదాయం, హిల్‌టాప్ రోడ్డులో మల్టీపర్పస్ భవనాలను పరిశీలించారు. ఈ క్రమంలో నూతన బస్టాండ్ విషయంపై కలెక్టర్ ఆరా తీశారు. బస్టాండ్‌లో భక్తులను దించిన తర్వాత.. ఆ బస్సులను పాదాలమ్మ, బంగారమ్మ ఆలయాల సముదాయానికి పంపించి అక్కడ కొండదిగువకు వెళ్లే భక్తులను ఎక్కించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దేవస్థానం చేపడుతున్న మరిన్ని అభివృద్ధి పనులను ఈవో వి.త్రినాథరావు కలెక్టర్‌కు వివరించారు. పర్యాటక శాఖ ఈఈ కె.రమణ, ఏఈ మదన్‌మోహన్, దేవస్థానం ఈఈలు పాల్గొన్నారు.

'సీవిజిల్'కు సన్నాహక శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో నేవీ, మెరైన్ పోలీస్, లైట్ హౌస్ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: 'సీ విజిల్'సమర సన్నద్ధ విన్యాసాలకు సంబంధించిన శిక్షణ తరగతులను ఇండియన్ నేవీ నిర్వహిస్తోంది. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో కోస్టల్ సెక్యూరిటీకి బాధ్యత వహించే నౌకాదళాధికారులు, ఏపీ నోడల్ అధికారులు, మెరైన్ పోలీసులు, డీజీఎల్ఎల్ లైట్ హౌస్ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ వర్క్‌షాప్‌ను శనివారం ప్రారంభించారు. తీరప్రాంత భద్రత, కమ్యూనికేషన్, నిఘా, పెట్రోలింగ్, ముప్పు గుర్తింపు, రిపోర్టింగ్ ప్రోటోకాల్‌లపై శిక్షణ అందించారు. నవంబర్ 20, 21న నిర్వహించే సీవిజిల్ ప్రధాన వ్యాయామానికి సంసిద్ధతను అధికారులు తెలియజేశారు. తీర భద్రతపై ప్రధాన ఏజెన్సీగా భారత నౌకాదళాన్ని నియమించినట్లు అధికారులు వెల్లడించారు.

వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్‌గా ప్రణవ్‌గోపాల్



విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్‌గా మానం వెంకట ప్రణవ్‌గోపాల్‌ను ప్రభుత్వం నియమించింది. తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్(టీఎన్ఎస్ఎఫ్) అధ్యక్షుడిగా పనిచేస్తున్న ప్రణవ్‌గోపాల్‌కు రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్‌తో సత్సంబంధాలు ఉన్నాయి. దీంతో రెండో దఫా నామినేటెడ్ పోస్టులో ప్రణవ్‌కు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ పదవి దక్కింది.

ఆమే.. రథసారథి

మహిళల చేత.. మహిళల కోసం..

కేరళలో షీ ట్యాక్సీ.. హైదారాబాద్‌లో షీ క్యాబ్.. బెంగళూరులో పింక్ క్యాబ్.. మరి వైజాగ్‌లో.? ఇదే ఆలోచన నగరానికి చెందిన రాధిక బెహరాకు వచ్చింది. మెట్రోలు, క్యాబ్‌లు అందుబాటులోకి వచ్చినా.. మహిళల భద్రత ఇప్పటికీ అనుమానంగానే ఉంది. దేశంలో ప్రతీ 10 మంది మహిళల్లో ఏడుగురు వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఈ బాధల బందిఖానా నుంచి సాటి మహిళలకు భరోసానిచ్చేందుకే రాధిక మదిలో పుట్టిన ఆలోచనే ఫెమిరైడ్స్. దక్షిణ భారత దేశంలో మహిళల కోసం పలు చోట్ల ప్రత్యేక ట్యాక్సీ వ్యవస్థ ఉన్నప్పటికీ.. మహిళలే నడిపే బైక్, ఆటో, ట్యాక్సీ వ్యవస్థను మొదటిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చింది మాత్రం ఫెమిరైడ్స్.

– సాక్షి, విశాఖపట్నం

SUNDAY SPECIAL



బైక్ రైడింగ్ బుక్ చేసుకున్న మహిళతో రైడర్

సింహాచలం ప్రాంతానికి చెందిన రాధిక బెహరా సొంతూరు గుంటూరు జిల్లా నరసరావుపేట. తన బావ శ్రీనివాస్‌ను వివాహం చేసుకుని విశాఖ వచ్చేశారు. ఆయన గాజువాక ఆర్టీసీ డిపోలో ఏడీసీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇద్దరు ఆడపిల్లలు ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఆడ పిల్లలను ఒంటరిగా కాలేజీకి పంపించడం ఇష్టం లేని రాధిక.. కారు డ్రైవింగ్ నేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. డ్రైవింగ్ శిక్షకుడి ప్రవర్తన ఆమెలో మరింత ఆందోళనను రేకెత్తించింది. అదే సమయంలో హైదరాబాద్ వెళ్లినప్పుడు కొత్తగా షీ క్యాబ్స్ అందుబాటులోకి వచ్చిన విషయాన్ని గమనించిన ఆమె.. విశాఖలో ఈ తరహా సేవలు ఎందుకు ప్రారంభించకూడదని తనకు తాను ప్రశ్నించుకున్నారు.



ట్రావెల్ రంగంలోకి మహిళలు రావాలి

మహిళలు ట్రావెల్ రంగంలోకి ఆశించిన స్థాయిలో రావడం లేదు. మా సంస్థలో ఇప్పుడు కేవలం 15 మందే ఉన్నారు. ఈ సంఖ్య ఇంకా పెరగాలి. మహిళలకు ఉపాధి మార్గంగా ట్రావెలింగ్‌ను ఎంచుకోవాలి. నామమాత్రం సిబ్బంది ఉంటేనే ఇప్పటి వరకు 1000కి పైగా బైక్ రైడ్స్, 20కిపైగా క్యాబ్ రైడ్స్ అందించాం. యాప్ వచ్చాక సేవలు విస్తృతమవుతాయి. నా చుట్టుపక్కల సమాజంలో జరుగుతున్న సంఘటనలను స్ఫూర్తిగా తీసుకొని ఫెమిరైడ్స్ ప్రారంభించాను. ఈ సేవలు ఎంత మందికి చేరువైతే అంతమంది మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంది.

– రాధిక బెహరా, ఫెమిరైడ్స్ వ్యవస్థాపకురాలు



- విశాఖలో తొలిసారిగా వుమెన్ రైడ్ సర్వీస్
- 15 మంది మహిళలకు ఉపాధి అవకాశాలు
- ఫెమిరైడ్స్ పేరుతో స్టార్టప్ ప్రారంభించిన రాధిక బెహరా

సంగీతం నుంచి..

ప్రైవేట్ పాఠశాలలో సంగీతం టీచర్‌గా విధులు నిర్వర్తించే రాధిక.. ఓ ఎన్‌జీవో సంస్థకు మేనేజర్‌గా కూడా పనిచేశారు. కోవిడ్ సమయంలో సామాజిక కార్యకర్తగా వేల మంది ఆకలి తీర్చారు. స్వచ్ఛంద సంస్థల కోసం పనిచేసేటప్పుడు బైక్‌పై రాధిక వందల కిలోమీటర్లు ప్రయాణించారు. ట్రావెలింగ్‌లో మహిళలు పడే ఇబ్బందులను స్వయంగా చూసిన ఆమె.. ఫెమిరైడ్స్ పేరుతో స్టార్టప్‌ను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలతో ఎంతో మందిని కలిసినా ఆమెకు ఎక్కడా ప్రోత్సాహం లభించ లేదు. చివరికి ఓ సంస్థ ముందుకొచ్చింది. 2020లో ఫెమిరైడ్స్ పోస్టర్ ఆవిష్కరణ జరగ్గా.. కోవిడ్ దెబ్బకొట్టింది. 2022లో మరోసారి ముందడుగు వేయగా.. తల్లిదండ్రుల అనారోగ్యంతో బ్రేక్ పడింది. అయినా మొక్కవోని దీక్షతో మరోసారి ఈ ఏడాది మార్చిలో రాధిక కలల ప్రాజెక్టు పట్టాలెక్కింది.

త్వరలో మొబైల్ యాప్

ఉబర్, ఓలా, ర్యాపిడో మాదిరిగా ఫెమిరైడ్స్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాధిక తెలిపారు. ప్రస్తుతం 85528 55283 కాల్ సెంటర్ నంబర్ ద్వారా రైడ్ బుకింగ్ సేవలను ప్రారంభించిన రాధిక.. యాప్ డిజైన్ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రైడ్ బుకింగ్‌తో పాటు మహిళల డ్రైవింగ్ శిక్షణకు రిజిస్టర్ అయ్యేలా డిజైన్ చేస్తున్నారు. వచ్చే జనవరి లేదా ఫిబ్రవరిలో యాప్ అందుబాటులోకి వచ్చాక.. సేవలను విస్తృతం చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఫెమిరైడ్స్ రెండు క్యాబ్స్, మూడు రైడ్ బైక్‌లు, ఒక ఆటోతో మహిళలకు రైడింగ్ అందుబాటులో ఉంది. 4 డ్రైవింగ్ ట్రైనింగ్ కార్లు ఉన్నాయి. మొత్తం 15 మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించారు. మరింత మంది మహిళలకు ఉపాధి కల్పించేందుకు రాధిక ఈ–సైకిల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్థానికంగా ఉండే హోటళ్లు, సూపర్ మార్కెట్లతో అనుసంధానం చేసి.. ఆహారం, నిత్యావసరాలు డెలివరీ చేసేలా ప్రాజెక్టుకు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే 5 ఎలక్ట్రిక్ సైకిళ్లు అందుబాటులో ఉన్నాయి. అన్నట్టు ఫెమిరైడ్స్‌లో అన్నీ ఎలక్ట్రిక్ వాహనాలనే వినియోగిస్తున్నారు.

డ్రైవింగ్ నేర్పించి.. ఉపాధి

ముందుగా కార్ ట్యాక్సీ.. తర్వాత బైక్ రైడ్, ట్యాక్సీ రైడ్, ఆటో రైడ్‌లను ఈ స్టార్టప్‌లో భాగం చేశారు. ఫెమిరైడ్స్‌లో చేరే వారికి మొదట అనుభవం ఉన్న శిక్షకులతో డ్రైవింగ్ నేర్పిస్తున్నారు. ఇప్పటి వరకు 150 మందికి పైగా శిక్షణ తీసుకున్నారు. రోజుల వ్యవధిలో డ్రైవింగ్‌లో మెలకువలు నేర్పించడం ఈ సంస్థ ప్రత్యేకత. ఇతర ఏజెన్సీల మాదిరి కమీషన్ రూపంలో కాకుండా సిబ్బందికి జీతం అందిస్తున్నారు. పార్ట్ టైం, ఫుల్ టైం రైడ్ చేసే వీలు కల్పించారు.

జీవన స్థితిగతుల్లో మార్పులు



నేను చేస్తున్న తొలి ఉద్యోగమిది. అమ్మకు ఆరోగ్యం బాగోలేదు. బెడ్‌పైనే ఉంది. ఉద్యోగానికి వెళ్తే.. అమ్మని చూసుకునే టైమ్ ఉండేది కాదు. ఫెమిరైడ్స్ వచ్చాక నా జీవితంలో మార్పులు వచ్చాయి. బైక్ రైడింగ్‌తో ఉపాధి దొరికింది. రైడ్ ఉన్నప్పుడు వెళ్లడం.. సమయం దొరికినప్పుడు అమ్మకు మందులు వేస్తూ సేవ చేయడం దినచర్యగా మారింది.

– కె.రమ్య, బైక్ రైడర్, ఊర్వశి జంక్షన్

ఇష్టంతో పనిచేస్తున్నాను



చిన్న చిన్న ఉద్యోగాలు చేసేదాన్ని. ప్రతి చోటా ఏదో ఒక ఇబ్బంది ఎదురయ్యేది. మనకంటూ స్వేచ్ఛగా పని చేసే ఉద్యోగం కోసం వెతుకుతున్న తరుణంలో ఫెమిరైడ్స్ గురించి తెలిసింది. వెంటనే రాధిక మేడంను ఆశ్రయించాను. కారు డ్రైవింగ్ నేర్పించారు. ఉపాధి కల్పించారు. ఇప్పుడు హాయిగా.. స్వేచ్ఛగా ఇష్టంతో పని చేస్తున్నాను.

– సోనూ షేక్, క్యాబ్ డ్రైవర్



ఫెమిరైడ్ ట్యాక్సీ బుక్ చేసుకున్న మహిళతో మహిళా రైడర్

అట్టడుగు ప్రజలకు న్యాయ సహాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, చిత్రంలో న్యాయమూర్తులు

విశాఖ లీగల్: సమాజంలో అట్టడుగు స్థాయి ప్రజలకు కూడా న్యాయ సహాయం అందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. శనివారం జాతీయ న్యాయసేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవా సదన్‌లో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. లోక్‌అదాలత్ ద్వారా కేసులు రాజీ మార్గంలో పరిష్కరించుకొని సత్వర న్యాయం పొందవచ్చన్నారు. న్యాయ సహాయం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 15100ను సంప్రదించాలన్నారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్-39ఎ ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన వర్గాలందరికీ ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కుటుంబ న్యాయ స్థాన న్యాయమూర్తి రాధారత్నం, రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కృష్ణ మోహన్, అదనపు జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఎంవీఎన్ సింధూర, ప్రజా న్యాయ పీఠం అధ్యక్షుడు జి.వల్లభనాయుడు, సీనియర్ న్యాయమూర్తులు, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, మేజిస్ట్రేట్‌లు, న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్యానల్ న్యాయవాదులు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు, జూనియర్, సివిల్ న్యాయమూర్తులు, మేజిస్ట్రేట్‌లు దృశ్య శ్రావణ మాధ్యమం ద్వారా పాల్గొన్నారు.

ఏడీఆర్‌ఎంగా శాంతారాం



తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)గా ఇ.శాంతారాం శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2004 ఇండియన్ రైల్వే సర్వీస్ ఇంజినీర్స్ బ్యాచ్‌కు చెందిన ఆయనకు రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో విశేష అనుభవం ఉంది. గత నాలుగేళ్లలో దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ ఇంజినీర్‌గా, సికింద్రాబాద్‌లో డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. ఇంతవరకు ఏడీఆర్‌ఎంగా ఉన్న సుధీర్‌కుమార్ గుప్తా సెంట్రల్ రైల్వేకు బదిలీ అయ్యారు.

మహిళలకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు

ఎంవీపీకాలనీ: పీఎంఏజేఏవైలో భాగంగా ఎస్సీ మహిళలకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ తెలిపారు. ఈ పథకం ద్వారా డ్వాక్రా, ఇతర మహిళలకు సేవా,సూక్ష్మ, చిన్న తరహా వ్యాపారాలకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రుణం అందిస్తామన్నారు. రూ.3లక్షల రుణం తీసుకుంటే రూ.50 వేల రాయితీ ఉంటుందని.. మిగతా రూ.2.5 లక్షల రుణాన్ని వడ్డీ లేకుండా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 71 మందికి రుణాలు అందిస్తామన్నారు. సోమవారం నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే అరెస్టులు

- చేతకాని ప్రభుత్వాన్ని ప్రశ్నించే వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులు
- మాజీ సీఎం జగన్‌పై అసభ్య పోస్టులు పెట్టిన టీడీపీ వారిని అరెస్టు చేయాలి
- డీసీపీ–1 అజిత వేజెండ్లకు ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి, అదీప్‌రాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పార్టీ నేతలు

విశాఖ సిటీ: రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేయాలని కోరుతూ ఆయనతో పాటు ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, ఇతర నేతలు శుక్రవారం పోలీస్ కమిషనరేట్‌లో డీసీపీ–1 అజిత వేజెండ్లకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు పెరిగిపోయాయని, ఈ విషయాన్ని స్వయంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అంగీకరించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో 50 మంది మహిళలపై అత్యాచారాలు జరిగాయి.. 50 మందికి పైగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలను హత్య చేశారు.. దీనికి కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అలాగే ఈ ఘోరాలను ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం సరికాదని హితవు పలికారు. విశాఖలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు నలుగురిపై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వెల్లడించారు. అక్రమ అరెస్టులపై వైఎస్సార్‌సీపీ ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించిందని, ప్రభుత్వం, పోలీసుల తీరుపై కోర్టు తీవ్ర వాఖ్యలు చేసిందని వివరించారు. కార్యకర్తలకు అండగా నిలబడతామని, వారిలో ధైర్యాన్ని, పోరాట స్ఫూర్తిని నింపుతామని చెప్పారు.

జగన్‌పై పోస్టులు పెట్టిన వారిని అరెస్టు చేయాలి

మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న టీడీపీ కార్యకర్తలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీకి సంబంధించిన ఏడెనిమిది అకౌంట్ల ద్వారా ఈ పోస్టులు చేస్తున్నారని అన్ని ఆధారాలతో డీసీపీ-1కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

టీడీపీ కార్యకర్తల్లా పోలీసులు

పోలీసులు టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. తాము ఫిర్యాదు చేసి ఎకనాలెడ్జ్‌మెంట్ అడిగితే.. రిసీవ్డ్ అని రాసి సంతకం చేసి మళ్లీ కొట్టేశారని, స్టాంప్ కూడా వేయలేదన్నారు. పోలీస్ ఉద్యోగం చేస్తున్నారా? లేదా టీడీపీ కార్యకర్తలుగా పనిచేస్తున్నారా? అని ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబా? జగనా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఇప్పటికీ ఎక్కడ ఏం జరిగినా జగన్‌ను నిందించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబా? జగన్‌మోహన్‌రెడ్డా? అని ప్రశ్నించారు. విశాఖలో డ్రగ్స్‌తో దొరికిన కంటైనర్ వ్యవహారంపై డిప్యూటీ సీఎం పవన్ ఎక్స్ ద్వారా చేసిన ట్వీట్‌పై మీడియా అడిగిన ప్రశ్నకు అమర్‌నాథ్ స్పందిస్తూ.. ఆ కేసు దర్యాప్తు చేస్తున్న ఏజెన్సీ ఎవరి పరిధిలో ఉందని ప్రశ్నించారు. డీసీపీకి ఫిర్యాదు చేసిన వారిలో ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, అదీప్‌రాజ్, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గొలగాని శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకులు తిప్పల దేవన్‌రెడ్డి, బాణాల శ్రీనివాసరావు, మొల్లి అప్పారావు, రాష్ట్ర అనుబంధ విభాగ అధ్యక్షులు జాన్ వెస్లీ, పేర్ల విజయ్‌చందర్, రాష్ట్ర అనుబంధ ఉపాధ్యక్షులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, పేడాడ రమణికుమారి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతులపై ఉక్కుపాదం

నలుగురు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తల అక్రమ అరెస్ట్ • కూటమి నేతల అక్రమ ఫిర్యాదులతో నాన్‌బెయిలబుల్ కేసులు



తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నిరాధార ప్రకటన చేస్తే.. భక్తుల మనోభావాలు దెబ్బతినలేదంట.. తిరుమల అన్న ప్రసాదంలో జెర్రి వచ్చిందన్న నిజాన్ని పోస్టు పెడితే మనోభావాలు దెబ్బ తిన్నాయని కేసులు.

చంద్రయాన్–3 కోసం ఇస్రో రూ.615 కోట్లు ఖర్చు చేస్తే.. విజయవాడ వరద బాధితులకు అందించిన పులిహోరకు రూ.326 కోట్లా అని ప్రశ్నిస్తే.. ముఖ్యమంత్రి చంద్రబాబును కించపరిచారంటూ కేసు..

ఇలా ప్రభుత్వ తప్పిదాలు.. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రశ్నిస్తున్న నోర్లను నొక్కేయాలని కూటమి ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతోందనడానికి సజీవ సాక్ష్యాలే ఈ కేసులు.

సాక్షి, విశాఖపట్నం/మధురవాడ/అగనంపూడి : రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని సాక్షాత్తు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బహిరంగ సమావేశంలోనే వ్యాఖ్యలు చేయడం రాష్ట్రంలో తీవ్ర దుమారాన్ని రేపింది. ఆ వ్యాఖ్యలతో ప్రభుత్వ గొంతులో వెలక్కాయ పడినట్లయింది. దీంతో నష్ట నివారణ చర్యలకు దిగిన చంద్రబాబు ప్రభుత్వం ఎప్పటిలాగే డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీసింది. ప్రజల దృష్టిని మరల్చడానికి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీస్ అస్త్రాన్ని ప్రయోగించింది. 2019 నుంచి ఇప్పటివరకు సోషల్ మీడియాలో వచ్చిన పోస్టుల ఆధారంగా ప్రశ్నించే గొంతులను ఖాకీల ద్వారా నొక్కించే ప్రయత్నాలు చేస్తోంది. ప్రజాస్వామ్యాన్ని హరిస్తూ.. భావ ప్రకటన స్వేచ్ఛను కాలరాస్తూ.. కక్ష సాధిస్తూ.. అక్రమ కేసులు బనాయిస్తూ.. సోషల్ మీడియా కార్యకర్తలను జైలుకు పంపిస్తోంది. ఇప్పటికే విశాఖ జిల్లాకు చెందిన నలుగురు కార్యకర్తలకు చిత్ర హింసలకు గురిచేసి కటకటాల పాలు చేసింది. మరింత మందిని కూడా జైలు పాలు చేయడానికి కూటమి పార్టీల చోటా నేతల ద్వారా కేసులు పెట్టిస్తోంది.

4 రోజులుగా పొదిలిలో ప్రత్యేక రూంలో నిర్బంధం

మద్దిలపాలేనికి చెందిన బోస రమణారెడ్డి మత విద్వేషాలు రెచ్చగొట్టడంటూ ప్రకాశం జిల్లా పొదిలి పోలీసులు ఈ నెల 6వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. ముందు ఒంగోలు పోలీస్‌స్టేషన్‌కు, తరువాత ఎస్పీ కార్యాలయానికి, అక్కడ నుంచి పొదిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాలుగు రోజుల నుంచి అక్కడే ప్రత్యేక రూంలో నిర్బంధించారు.

నోటీసులు ఇవ్వకుండానే తిరుపతి అరెస్ట్

బక్కన్నపాలేనికి చెందిన తిరుపతి లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేశాడంటూ విజయవాడలో మొగలరాజపురానికి చెందిన పోలీసులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఈ నెల 6న అదుపులోకి తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ సహకారంతో కుటుంబ సభ్యులు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయగా అక్రమంగా లోకేష్ నిర్బంధించడాన్ని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది.

విచారణ పేరుతో వేధింపులు



అగనంపూడి: విచారణ పేరుతో పొలిటికల్ పంచ్ వెబ్‌చానల్ నిర్వాహకుడు ఇంటూరి రవికిరణ్‌ను దువ్వాడ పోలీసులు శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. మధురవాడలోని ఆయన నివాసం నుంచి స్టేషన్‌కు తరలించారు. మధుమేహంతో బాధపడుతున్న ఆయనకు మధ్యాహ్నం మూడున్నర వరకు కనీసం భోజనం చేయనీయకుండా విచారణ పేరుతో మానసిక వ్యధకు గురిచేశారని రవికిరణ్ భార్య సుజన, కుమారుడు హృదయ్ ఆవేదన వ్యక్తం చేశారు. భోజనం చేసి టాబ్లెట్ వేసుకోవాలని చెప్పినా సీఐ అనుమతించేది లేదని.. కనీసం తమ కారు వద్దకు వెళ్లనీయలేదని వాపోయారు. రాత్రి 9 దాటిన తరువాత రవికిరణ్‌కు 41ఎ నోటీసులు అందించి ఈనెల 11వ తేదీన మెజిస్ట్రేట్ ముందు హాజరు కావాలని చెప్పి విడిచిపెట్టారు. ఇదిలా ఉండగా రవికిరణ్‌పై మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదవ్వడంతో ఆయన్ని అక్కడికి తరలించారు. అక్కడ కూడా 41ఏ నోటీసులు ఇచ్చి పంపించేశారు. రవికిరణ్‌ను కేసులు, విచారణ అంటూ రెండు నెలలుగా పోలీసులు చిత్ర హింసలకు గురిచేస్తున్నారని ఆయన భార్య సుజన వాపోయారు. గుంటూరు, విజయవాడ, మార్టూరు, గుడివాడ పోలీస్టేషన్లలో కేసులు నమోదు చేసి మానసికంగా వేధిస్తున్న ఆందోళన వ్యక్తం చేశారు.

వెంకటేష్‌కు రిమాండ్



గాజువాక మండలం గొల్లజగ్గరాజుపేటకి చెందిన బోడి వెంకటేష్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అభ్యంతరకర పోస్టులు పెట్టారన్న కారణంగా వెంకటేష్‌పై ఈ నెల 3వ తేదీన బాపట్ల జిల్లా మార్టూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 5వ తేదీన బాపట్ల పోలీసులు నోటీసు ఇవ్వకుండా వెంకటేష్‌ను దువ్వాడ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు. 41ఏ నోటీసు ఇచ్చి విడుదల చేశారు. ఈ నెల 6వ తేదీన గాజువాకకు చెందిన టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు సాకెళ్ల రతన్‌కాంత్.. వెంకటేష్‌పై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు 7వ తేదీన విచారణకు పిలిచి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వెంకటేష్‌పై మహారాణిపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

మృత్యువును జయించిన శిశువు

కేజీహెచ్‌లో ఆశ్చర్యకర ఘటన

మహారాణిపేట: కేజీహెచ్ గైనకాలజీ వార్డులో శుక్రవారం రాత్రి జన్మించిన ఓ శిశువు ఆరోగ్య పరిస్థితి విషయంలో కొన్ని ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. నగరానికి చెందిన గర్భిణిని ప్రసవం కోసం శుక్రవారం కేజీహెచ్‌లోని గైనిక్ వార్డులో చేర్పించారు. రాత్రి 9 గంటల సమయంలో ఆమెకు శస్త్రచికిత్స చేయడం ద్వారా పసికందుకు జన్మనిచ్చింది. శిశువు అకస్మాత్తుగా చలనం లేకుండా పోవడంతో వైద్యులు ఆందోళన చెందారు. రాత్రంతా శ్రమించినప్పటికీ శిశువులో ఎలాంటి చలనం కనిపించలేదు. దీంతో తెల్లవారుజామున 4 గంటలకు మృతి చెందిందని నిర్ధారించారు. ఆస్పత్రి రికార్డుల్లో కూడా మృతి చెందినట్టు నమోదు చేశారు. పసికందును ఇంటికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌ను కూడా సిద్ధం చేశారు. అయితే అంబులెన్స్‌లో ఉంచిన శిశువులో కదలికలు కనిపించడంతో బిడ్డ తండ్రి వైద్యులను అప్రమత్తం చేశారు. వెంటనే ఇంక్యుబేటర్(ఐసీయూ)లో ఉంచి చికిత్స చేయడంతో ప్రస్తుతం శిశువు ఆరోగ్యంగా ఉందని, ఇంకా చికిత్స కొనసాగుతోందని వైద్యులు తెలిపారు. ఇలాంటి కేసులు అరుదని, శిశువును గైనకాలజిస్టులు, చిన్న పిల్లల వైద్యులు కలిసి చూస్తున్నారని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. ఈ సంఘటనపై విచారణకు ఆదేశించినట్లు వెల్లడించారు.



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పసికందు

కూల్‌జోన్ గణేష్‌తో ఆర్థిక లావాదేవీలు లేవు

- అతనితో ఎప్పుడూ మాట్లాడలేదు
- సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి

సీతమ్మధార: కూల్‌జోన్ సంస్థల అధినేత కొవ్వూరి గణేష్‌తో తనకు ఎటువంటి ఆర్థిక లావాదేవీలు లేవని సోనోవిజన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కరమూర్తి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్ చనిపోయే ముందు తీసుకున్న వీడియోను చూసి తానూ దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. గణేష్ ఆత్మహత్య చేసుకోవడం తనను కలచివేసిందన్నారు. తానెప్పుడూ నేరుగా గణేష్‌ను చూడలేదని, ఫోన్‌లో కూడా మాట్లాడలేదన్నారు. తమ ఇద్దరి మధ్య ఎటువంటి ఆర్థిక లావాదేవీలు లేవని స్పష్టం చేశారు. తాను గత 54 ఏళ్లుగా వ్యాపారం చేస్తూ.. రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, విశాఖలో 50 శాతం మార్కెట్‌షేర్‌తో ఏడాదికి రూ.2 వేల కోట్ల మేరకు టర్నోవర్ చేస్తున్నట్లు తెలిపారు. విశాఖలో తమ సంస్థ ద్వారా నెలకు రూ.40 కోట్లకు పైగా విక్రయాలు ఉంటాయన్నారు. గణేష్ చేసే వ్యాపారానికి ఇది 30 రెట్లు ఎక్కువ అన్నారు. కొంతమంది కంపెనీ మేనేజర్లు గణేష్‌కి దగ్గర అవ్వడం కోసం తన మీద లేనిపోని చాడీలు చెప్పి.. తాను గణేష్‌ను కబలించి వేస్తున్నాననే భ్రమను కలిగించారని ఆరోపించారు. వర్ల్‌పూల్, ఎల్‌జీ కంపెనీల మేనేజర్లు తన మీద విద్వేషపూరితమైన వ్యాఖ్యలు చేయడం గణేష్ విడుదల చేసిన ఆడియో క్లిప్పింగ్‌లో ఉందన్నారు. ఆయన పదేళ్ల కిందట వ్యాపారంలోకి వచ్చారని, తగిన అనుభవం లేకపోవడం, అపోహలతో తన మీద ద్వేషం పెంచుకున్నారన్నారు. కూల్‌జోన్ షోరూం ఉన్న భవనం ఖాళీ చేయించడానికి తాను ప్రయత్నించానని, భవనం యజమానిని కూడా ఇలాగే వేధించి చంపేశానని ఆరోపించడం సరికాదన్నారు. కంపెనీలకు చెప్పి కూల్‌జోన్ షోరూంలకు మెటీరియల్ రాకుండా ఆపేశానని చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యం అన్నారు. బజాజ్ ఫైనాన్స్ మీటింగ్‌లో తాను కాపు కులాన్ని దూషించానని చెప్పడం పూర్తిగా అవాస్తవమన్నారు. గణేష్ మృతి మీద సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని భాస్కరమూర్తి పోలీసులను కోరారు.

పారా మిలట్రీ జవాన్ కన్నుమూత

- ఎన్నికల విధుల్లో ఉండగా గుండెపోటు
- భార్యాభర్తలిద్దరూ పారా మిలట్రీ జవాన్లే
- శోకసంద్రంలో కిల్లివానిపాలెం



చంద్రినాయుడు(ఫైల్)

సబ్బవరం: అయ్యన్నపాలెం శివారు కిల్లివానిపాలెం గ్రామానికి చెందిన పారా మిలట్రీ జవాన్ గుండెపోటుతో మరణించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఖరక్‌పూర్‌లో ఎన్నికల విధులకు వెళ్లిన ఆయన.. ఈ నెల 7న గుండెపోటు రావడంతో కుప్పకూలి మృతి చెందాడు. శనివారం ఆయన మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. వివరాలివీ.. కిల్లివానిపాలేనికి చెందిన బండారు చంద్రినాయుడు బి.టెక్ వరకు చదువుకున్నారు. 2021లో పారా మిలట్రీ జవాన్‌గా విధుల్లో చేరారు. అదే విభాగంలో పనిచేస్తున్న పరవాడ మండలం వెన్నపాలేనికి చెందిన నందినిని గతేడాది అక్టోబర్ 26న వివాహం చేసుకున్నారు. భార్యాభర్తలిద్దరూ ఉత్తరప్రదేశ్‌లోని ఒకే బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎన్నికలు విధులకు హాజరైన చంద్రినాయుడు గుండెపోటుతో మరణించడంతో కిల్లివానిపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సీఆర్‌పీఎఫ్ వాహనంలో ఆయన భౌతికకాయాన్ని శనివారం గ్రామానికి తీసుకొచ్చారు. చంద్రినాయుడును చివరిసారిగా చూసేందుకు అయ్యన్నపాలెంతో పాటు బోదువలస, గుల్లేపల్లి, ఎల్లుప్పి తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. భార్య నందిని, తల్లి మల్లమ్మ, సోదరి పార్వతి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ బుదరెడ్ల లక్ష్మి, ఉప సర్పంచ్ కనకరాజు, నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి తదితరులు జవాన్ పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అధికారిక లాంఛనలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆయన తండ్రి దేముడు గతంలో మృతి చెందారు. అంత్యక్రియల్లో సీఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ ఎస్.అమ్మునాయుడు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



రోదిస్తున్న మృతుడి తల్లి మల్లమ్మ, బంధువులు

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

తగరపువలస/పెదగంట్యాడ/పరవాడ/మద్దిలపాలెం: రాష్ట్ర ఉత్తమ గురువులుగా జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరిలో భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ ముద్దాడపేట ఎంపీపీ స్కూల్ ఎస్జీటీ సువ్వారు రాజేంద్రప్రసాద్, చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన స్కూల్ అసిస్టెంట్ పక్కి నాగేశ్వరరావు, గంగవరం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(కెమిస్ట్రీ) పాలగుమ్మి రాజారావు, పరవాడ మండలం బాపడుపాలెం పాఠశాల ఎస్జీటీ కొరుపోలు గంగాధర్‌రావు ఉన్నారు. వీరిని పలువురు ఉపాధ్యాయులు అభినందనలతో ముంచెత్తారు. ఈ నెల 11న విజయవాడలో నిర్వహించనున్న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో వీరు అవార్డులు స్వీకరించనున్నారు.

- సువ్వారు రాజేంద్రప్రసాద్ స్వస్థలం శ్రీకాకుళం. ఆయన ప్రాథమిక, హైస్కూల్ విద్యను ఎచ్చెర్లలో పూర్తి చేశారు. నగరంలోని కృష్ణా కళాశాలలో ఇంటర్మీడియెట్, ఎంవీపీ లా కళాశాలలో న్యాయపట్టా పొందారు. ఏయూలో పాలిటిక్స్‌లో పీజీ చేసిన ఆయన బీఈడీ కూడా పూర్తి చేశారు. ప్రస్తుతం మధురవాడలో నివాసం ఉంటున్నారు. ఆయన మొదటి పోస్టింగ్ అరకు మండలంలోని మాలసింగారం కాగా తర్వాత యలమంచిలి మండలం రుక్మిణీపురంలో పనిచేశారు. 2016 జూన్ నుంచి భీమిలి మండలం ముద్దాడపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. ఆయన ఎంఆర్పీ, డీఆర్పీ, స్టేట్ రీసోర్స్ పర్సన్‌గా పనిచేశారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా, గురుబ్రహ్మ రాష్ట్ర అవార్డులను స్వీకరించారు. స్వచ్ఛంద సంస్థలతో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- పక్కి నాగేశ్వరరావు స్వస్థలం భీమిలి. ఆయన విద్యాభ్యాసం అంతా ఈ ప్రాంతంలోనే సాగింది. ప్రస్తుతం చిట్టివలసలో ఉంటున్నారు. ఎమ్మెస్సీ, ఎంఏ(హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్), బీఈడీ పూర్తి చేశారు. 2005లో రోలుగుంటలో ఎస్జీటీగా విధులు ప్రారంభించి తర్వాత పద్మనాభం మండలం రేవిడి వెంకటాపురం హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా చేరారు. ప్రస్తుతం చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఫిజిక్స్ బోధిస్తున్నారు. ఎన్ఎంఎంఎస్‌లో విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఐఐఐటీ, కౌశల్ క్విజ్ పోటీలు, చెకుముకి, వివిధ సంస్థలు నిర్వహించే స్కాలర్‌షిప్ పోటీల్లో విద్యార్థులు ఎంపిక కావడంతో నాగేశ్వరరావు మాస్టర్ శ్రమ ఎంతో ఉంది.



రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు, రాజారావు, గంగాధర్

ఉత్తమ అధ్యాపకులు..

మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ముగ్గురు అధ్యాపకులు ఉత్తమ గురువులుగా ఎంపికయ్యారు. వాణిజ్య శాస్త్ర విభాగం అధ్యాపకుడు డి.మురళీధర్, మైక్రోబయాలజీ అధ్యాపకురాలు సిహెచ్ శాంతిదేవి, హిందీ అధ్యాపకురాలు బి.లక్ష్మి రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా అవార్డులు స్వీకరించనున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులను ప్రిన్సిపాల్ అభినందించారు.



అధ్యాపకులు మురళీధర్,శాంతి దేవి, లక్ష్మి

'లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడం చాలా సులువు'

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వ పింఛనుదారుల డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించేందుకు మైల్‌స్టోన్ ఫేస్ అథెంటికేషన్ టెక్నిక్‌ను ఆండ్రాయిడ్ ఫోన్ కలిగిన వారందరూ వినియోగించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ కోరారు. భారత ప్రభుత్వం, పెన్షనర్ల శాఖ 2021లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రమోట్ చేయడంలో భాగంగా ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంజు గుప్తా ఈ నెల 11న విశాఖ వస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ మోడ్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు ప్రమోట్ చేయడం, ఫేస్ అథెంటికేషన్ టెక్నిక్‌ను విస్తృతంగా ప్రచారం చేయడం కోసం జాతీయస్థాయిలో డీసీఎల్ 3.0 క్యాంపెయిన్ ప్రారంభించినట్లు చెప్పారు. అన్ని రిజిస్టర్డ్ పెన్షనర్ల అసోసియేషన్లు, పెన్షన్ పంపిణీ చేసే బ్యాంకులు, ఐపీపీబీ, భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, సీజీహెచ్ఎస్, వెల్‌నెస్ సెంటర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ నూతన టెక్నిక్‌ను ప్రోత్సహించాలని కోరారు. ఇంతకుముందు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు భౌతికంగా సమర్పించాల్సి వచ్చేదని.. ఇందుకోసం గంటల తరబడి బ్యాంకుల వద్ద క్యూల్లో నిరీక్షించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు.

రాష్ట్రంలో తాలిబన్ల తరహా పాలన

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టి అరెస్ట్ చేస్తారా?
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో చాలా దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెడుతుండడం అరాచక పాలనకు నిదర్శనమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి మండిపడ్డారు. తాజా పరిస్థితులను చూస్తుంటే రాష్ట్రంలో తాలిబన్ల తరహా పాలన సాగుతుందనడంలో ఎటువంటి అనుమానం అవసరం లేదన్నారు. విశాఖలో శనివారం మీడియాతో ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులను చూస్తుంటే, అసలు ఆంధ్రలో ఉన్నామా.. ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్నామా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా.. పౌర హక్కులున్నాయా...? అని ప్రశ్నించారు. సుధారాణి అనే సామాన్య సోషల్ మీడియా కార్యకర్తను తెలంగాణలో అరెస్ట్ చేసి చిలకలూరిపేటకు తీసుకొచ్చి ఐదు రోజుల పాటు నిర్బంధించి వేధించి, బాధించడం పాలకుల క్రూరత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఆమెపై పోలీసులు చేయి చేసుకోవడంతో ఒంటి మీద గాయాలను జడ్జికి చూపారంటే పరిస్థితులు ఎంత దిగజారిపోయాయో అర్థం చేసుకోవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టులు చేస్తున్నట్లే.. మాజీ సీఎం జగన్ కుటుంబీకులైన విజయమ్మ, షర్మిల, భారతమ్మ మీద దారుణ పోస్టులు పెట్టిన ఐటీడీపీ సోషల్ మీడియా వారిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. తుళ్లూరు మండలంలో తురక శ్రీను అనే వ్యక్తి ఏడాదిన్నర క్రితం చనిపోయినా నోటీసులు పంపి కేసులు పెట్టారంటే ప్రభుత్వ పైశాచికత్వం ఏ స్థాయికో చేరిందో తెలుస్తోందని ధ్వజమెత్తారు. ఆడపిల్లల మానప్రాణాల రక్షణలో వైఫల్యంతో ప్రజలకు సమాధానం చెప్పలేక డైవర్షన్ చేసేందుకే వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో లోకేష్ రూ.10 కోట్లు ఖర్చు చేసి తన తల్లిని తిట్టించారని పవన్ ఆరోపణ చేశారని, మరి ఇప్పుడు లోకేష్‌పై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్ట్ చూపకుండా స్టేషన్లు తిప్పుతున్నారని, ఆచూకీ కోసం హెబియస్ కార్పస్ పిటిషన్లు వేయాల్సి వస్తోందని, పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు.

ఇద్దరు కి'లేడీ'ల అరెస్ట్

పెందుర్తి: ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తున్న మహిళల నుంచి నగదు, బంగారం, సెల్‌ఫోన్లు తస్కరించిన ఇద్దరు మహిళలను పెందుర్తి పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పెందుర్తి క్రైం ఎస్ఐ సూరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. వేపగుంట విద్యానగర్‌కు చెందిన నీలి జ్యోతి ఈ నెల 6న ఎస్ఏడీ కొత్త రోడ్ నుంచి వేపగుంటకు ఆటోలో వస్తుంది. ఈ క్రమంలో తన హ్యాండ్ బ్యాగ్‌లోని రూ.23 వేలు విలువైన సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఈ ఘటనపై పెందుర్తి పోలీసులను బాధితురాలు జ్యోతి ఆశ్రయించింది. మల్కాపురం జనతా కాలనీకి చెందిన కోసూరి లక్ష్మి గాజువాక నుంచి పీఎం పాలెం ఆర్టీసీ బస్‌లో ప్రయాణం చేస్తున్న క్రమంలో ఆమె హ్యాండ్ బ్యాగ్‌ను దుండగులు తస్కరించారు. అందులో 12 తులాల బంగారు ఆభరణాలు, ఒక జత వెండి పట్టీలు, రూ.5 వేలు నగదు ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆయా కేసులను క్రైం విభాగం జోన్-2 ఏసీపీ డి.లక్ష్మణరావు, వెస్ట్ జోన్ సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పెందుర్తి క్రైం విభాగం ఎస్ఐ సూరిబాబు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆయా దోపిడీలకు పాల్పడిన విజయనగరం జిల్లా కొత్తవలస ప్రాంతానికి చెందిన రావుల పార్వతి, మేకల గంగమ్మ అలియాస్ గంగలను పెందుర్తిలో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 12 తులాల బంగారం, ఒక సెల్ ఫోన్, రూ.25 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. కేసులో ప్రతిభ కనబరిచిన హెచ్‌సీలు జి.నాగరావు, ఎం.ఎస్.నాయుడు, పీసీలు టి.శివప్రసాద్, బి.దేముడునాయుడు, సంతోషిలను ఉన్నతాధికారులు ప్రశంసించారు.

30 వేల పాములు పట్టుకున్నా..

స్నేక్ క్యాచర్ కిరణ్

సీతమ్మధార: తనకు పాములంటే చాలా ఇష్టమని స్నేక్ క్యాచర్ కిరణ్ అన్నారు. ఆయన జీవీఎంసీ గాంధీపార్కులో శనివారం మీడియాతో మాట్లాడారు. తాను ఇప్పటివరకు విశాఖ నగరం, ఒడిశాలో 30 వేల వరకు పాములు పట్టుకున్నట్లు తెలిపారు. 20 రోజుల కిందట ఎండాడ, ఆర్అండ్‌బీ, విమాననగర్ ప్రాంతాల్లో మూడు కొండచిలువలు పట్టుకున్నట్లు చెప్పారు. ఇవి ఒక్కొక్కటి 45 కిలోల బరువు ఉన్నట్లు వివరించారు. వీటికి అనారోగ్యం చేయడంతో జోన్-6 సహాయ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌తో చికిత్స అందించి.. తన సంరక్షణలో ఉంచినట్లు వెల్లడించారు. కొండచిలువల ఆరోగ్యం కుదుటపడిందని.. వీటిని ఆదివారం కంబాలకొండలో విడిచిపెడతానని చెప్పారు. రక్త పింజరి పాము చాలా ప్రమాదకరమైనదని, నాలుగు కోరలు గల ఈ పాము కాటు వేస్తే ప్రాణాపాయం ఉంటుందన్నారు. పాములు కనిపిస్తే తన(98491 40500)కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా అనారోగ్యం నుంచి కోలుకున్న పాములను గాంధీ విగ్రహం వద్ద ప్రదర్శనకు ఉంచారు. వీటిని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.



ఏమార్చితే తొక్కించేస్తాం..

- సీపీ శంఖబ్రత బాగ్చి హెచ్చరిక
- 181 మోడిఫైడ్ సైలెన్సర్ల ధ్వంసం

ఏయూక్యాంపస్: భారీ శబ్దాన్ని కలిగించే మోడిఫైడ్ సైలెన్సర్లను ఉపయోగించి వాహనాలు నడుపుతున్న వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు.. శనివారం వాటిని రోడ్ రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. బీచ్‌రోడ్‌లోని కాళీమాత ఆలయం ఎదురుగా 181 మోడిఫైడ్ సైలెన్సర్లను రోడ్డుపై వరసగా పేర్చి రోడ్ రోలర్‌ను వాటిపై నుంచి పంపి నిరుపయోగంగా మార్చారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ మోడిఫైడ్ సైలెన్సర్‌తో వాహనాలు నడిపి తొలిసారి చిక్కితే 3 నెలల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా, రెండవ పర్యాయం చేస్తే 3 నెలల పాటు లైసెన్స్ రద్దు, మూడో సారి దొరికితే ఆరు నెలలు జైలుశిక్ష విధించే అవకాశం ఉందన్నారు. వాహన లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేయడంతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లను అమర్చే వ్యక్తులను గుర్తించి, వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



రోడ్ రోలర్‌తో సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న విధానం పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

అయోధ్యలో విశాఖ నృత్య కళాకారుల ప్రతిభ

సీతమ్మధార: అయోధ్య యూనివర్సిటీలో శనివారం భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రామ్‌లీలా సంగీత నృత్యార్చన నిర్వహించారు. దొండపర్తి నుంచి సిరి డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు స్వర్ణ సారథ్యంలో 10 మంది నృత్య కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను విశేషంగా అలరించింది. 2024కు సంబంధించి రామ్‌లీలా పురస్కారాన్ని సిరి డ్యాన్స్ అకాడమీకి చెందిన పది మంది నృత్య కళాకారులకు అందజేశారు. దేశ వ్యాప్తంగా కూచిపూడి కళాకారులు పోటీపడ్డారు. విజేతలకు అయోధ్య మేయర్‌తోపాటు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కాశీవిశ్వనాథ్ టెంపుల్ శ్రీవిశ్వభూషణ్ మిశ్రా, అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ అశ్వినికుమార్ పాండే చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారు.

